**అవిద్యం ఆదే అలవాటు అతివలకు మాత్రమే కాదు. అందరికీ ఉండవచ్చు. కాని ఆడది అవిద్యం ఆడితే, అజ్ఞానం అంతా దిక్కువంత దుర్భేద్యంగా ఉంటుందంటారు. తప్పు అంతే. తెగించిన స్త్రీ చేయలేనిదంటూ ఉండదు. కాని ఆ బలమే ఒకొక్కప్పుడు సిరసంగా పరిణమించి అనర్థానికి దారితీస్తూ ఉంటుంది.**

---

బస్సు స్టాపు వద్ద వక్రించిన క్యూలో నిలుచున్న జనం బస్సునెక్కే ముందు క్యూ లాగ గుంపుగా చేర బడడానికి ప్రయత్నించారు. పొద్దు పోయినందువల్ల తమ తమ ఇళ్లకు చేరుకోవాలని అందరికీ ఆతుర్దాయే. సాయంకాలపు వెలుగు ఇంకా ఉన్నప్పటికీ, లైట్లు వెలి గాయి. స్వార్థం ఎక్కువై నియమాన్ని పాటించాలనే ఆసక్తి లేని ఒకరిద్దరు బస్సు ఆగే లోపుగానే లోనికి చొరబడ్డారు. అన్ని టౌన్ బస్సులలోను ఎక్కాలని చేసే దౌర్జన్యం అక్కడా జరిగింది.

"హట్ గే, హట్. దూరంగా పోతే నీకి తడనిస్తారా?" అని భార్యను ముందుకు తోశాడు ఒక సాయబు.

"నాయన్నాయన, నన్నెక్కనియ్యి ముసలిదాన్ని..." అని ఒక ముసలావిడ పద్మవ్యూహంలోకి దూరింది.

లోపల జనసమర్దం వల్ల. టిక్కెట్లు ఇస్తున్న కండక్టరు ప్రయత్నం మీద ఫుట్‌బోర్డు చేరుకుని ఈల నోటిలో పెట్టి, "చాలు, చాలు" అన్నాడు. ఇద్దరినే ఎక్కించుకోవాలనుకున్న కండక్టరుకు పదిమందికి పైగా లోనికి వచ్చేశారని చికాకయింది. ఎక్కిన వాళ్లను దించివెయ్యడం ఎలాగున్నా అయిదు మంది ఫుట్‌బోర్డు మీద ఒంటికాలితో పెనుగులాడుతున్నారు.

ఇక ఆలస్యంచేస్తే తనకే ముప్పు వస్తుందని రైట్ చెప్పాడు. డ్రైవర్ క్లచ్ మీద కాలు తియ్యడంతో ఒక ఊపు ఊగి బస్సు ముందుకు సాగింది. ఫుట్‌బోర్డు మీద ఎక్కలేనివారు దిగేసి దిక్కుముఖాలతో ఏవో అంటున్నారు. ఆ స్టాపులో ఎక్కినవారు సర్దుకుని నిలబడడానికి ప్రయత్నిస్తున్నారు.

"నీకి ముందికి పో. ఎక్కు హోడవాళ్లున్నారు" అన్నాడు సాయబు.

సుందరం వెనుదిరిగి చూశాడు. బురఖా కనిపిం చింది. బురఖా పక్కను ఇంకో స్త్రీని కూడా పరికిం చాడు.

"సారీ! ముందర కూడా ఆడవాళ్లు ఉన్నారండీ" అని కాస్త పక్కకు తొలగి కమ్మి పట్టుకుని తన వెనక ఉన్న ఆమెకు స్థలం చేశాడు. ఆమె ముందుకు జరిగింది. అలా ఇంకొక్క అడుగువేసి నిలబడింది. ఆమెను చూచి ఒక విద్యార్థి వెంటనే లేచి గౌరవార్థకంగా కూర్చో మన్నాడు.

"మార్కెట్, మార్కెట్. మార్కెట్ ఎవరైనా ఉన్నారా?" ఎవ్వరూ బదులు పలకలేదు. కండక్టర్ డబుల్ రైట్ చెప్పాడు. ఆ స్టాప్‌లో బస్సు ఆగక వేగంగా వెళ్లింది.

"టిక్కెట్స్, టిక్కెట్స్" అంటూ వస్తూ టిక్కెట్లు ఇస్తున్నాడు కండక్టర్. సుందరం ముందర సీటులో కూర్చున్న స్త్రీ వైపు చెయ్యి చూపాడు, తన టిక్కెట్టు ఆమె కొంటుందీ అన్నట్లు.

ఆమె చూడడానికి ఎక్కడో వర్క్ చేస్తున్నట్లుగా ఉంది. చేతిలో పాతబడిన ఒక చిన్న హేండ్ బాగ్ ఉంది. అందంగా లేకపోయినా ఆకర్షణ ఉంది. చవక ఒట్టలు కట్టుకున్నా ముచ్చటగా కట్టుకుంది. నెత్తిమీది జుట్టు కాస్త చెదిరి, పగలంతా చేసిన పనివల్ల అలసట ముఖంమీద అచ్చంగా తెలియవస్తూంది.

కండక్టర్ ఆమె వద్దకు వచ్చాడు.

"శాంతిపురం" అని పావలా చేతిలో పెట్టింది.

"ఒకటా, రెండా?" అన్నాడు టిక్కెట్టు చించ బోతూ.

"ఒకటి" అంది.

ఇంకా ముందున్న ముగ్గురికి టిక్కెట్లు ఇచ్చి వెనుదిరగబోయి, "ఇంకెవరికైనా టిక్కెట్స్" అని రెండు మూడు సార్లు హెచ్చరించాడు. ఎవ్వరూ పలక లేదు. సుందరం వద్దకు వచ్చి టిక్కెట్టు కొనమన్నాడు. సుందరం ఆమె వైపు చెయ్యి చూపాడు.

"అలా చెయ్యిచూపితే ఎవరు?" అన్నాడు చికాకుగ కండక్టర్.

"ఆ సీట్‌లో ఉన్న ఆమె కొనలేదా?"

---

## అమర

---

"లేదు, లేదు. మీరు తీసుకోండి."

"సారీ, ఈ సారి నన్ను చూపి అడగండి."

జనం ఎక్కువగా ఉన్నందువల్ల ముఖాలు కూడా కనబడక ఒకరి నొకరు అనుకుని ఉన్నారు. కండక్టర్ మళ్లీ ఆమె వద్దకు వచ్చి, "వారికి టిక్కెట్టు మీరే కొంటారా?" అన్నాడు.

"వారెవరు, వారు? నాతో ఎవ్వరూ లేరు. నే నొక్కత్తినే."

ఇంతలో అందరి కన్నులూ ఆమెను పరీక్షించాయి. కండక్టర్ సుందరం వైపుచూచి, "ఈమేనా, అండీ?" అన్నాడు.

"ఆఁ, ఆఁ. కొంటారు లెండి. నాకని చెప్పండి" అని తన ముఖం ముందర ఉన్న ఇద్దరి ముఖాల మధ్య ఇరికించి చూచాడు ఆమెను. అందరి కన్నులు సుందరం మీదకు పోయాయి. ఆమె కూడా వెనుదితిరిగి చూచింది.

"ఆయనెవరో నాకు తెలియదు."

"ఇదేదో గమ్మత్తుగా ఉందే!" అన్నాడు బుగ్గ మీసా లాయన ఎదురు సీటులోనుండి ఆమెకేసి చూస్తూ. కండక్టర్ లాభం లేదని సుందరం వైపు రాసాగాడు.

"కొనలేదూ? ఆఁ! ఇస్తారులే!" అన్నాడు మొండిగా సుందరం. బస్సులోని వారంతా విస్తుపోయి నిశ్శబ్దంగా ఉన్నారు.

"మీరు టిక్కెట్టు కొంటే కొనండి. లేకుంటే నెక్స్ట్ స్టాపులో దిగిపొండి" అని తోలు సంచి సవరించు కుని నిలబడ్డాడు కండక్టరు.

"ఇదేంబడాయే!" అని మూలనున్న ముసలావిడ సణిగింది. ఆమె మనవరాలు కాబోలు, "సుబ్బారుకో, అవ్వా. నీ కెందుకు?" అని పైట సవరిస్తూ సుంద రాన్ని చురచుర చూచింది.

"మీకేమవుతారండీ?" సుందరం పక్కన ఉన్నా యన ప్రశ్నించాడు.

"మా వారేలెండి" అన్నాడు. ఈ మూడు పదాలు అందరి చెవుల్లోనూ పడ్డాయి.

"అహాహ!..." అని ఓగ్గరగా నవ్వాడు బుగ్గమీసా లాయన, "అదా సంగతి" అంటూ.

ఆమె ముఖం వివర్ణమయింది. కళ్లు పాలిపో యాయి. అధరాలు కంపించాయి. ఏదో చెప్పాలని సుందరాన్ని తిరిగి చూచిన మనిషి, ఏమీ మాట్లాడక కళ్లు దించుకుంది. కళ్ళనీళ్లు ఆపదలిచిన ఆమె ప్రయత్నం విఫలమైంది.

"మిస్టర్, మీ టిక్కెట్టుకు కావలసిన డబ్బు నే నిస్తా, కొనుక్కోండి." ఇందాకా బాంధవ్యం అడిగిన మనిషి జేబులో చిల్లర తీశాడు.

"ఫర్వాలేదు. థాంక్స్."

ఇంతలో ఆమె వెనక ఉన్న ఒక పెద్దావిడ చొరవ చేసుకుని, "జగడాలు ఇంటివద్ద కానీ, ఇక్కడేమిటమ్మా! ఆలుమగల్లో ఎన్నో ఉంటాయి. బహిరంగం చేస్తారా? చూస్తే సంస్కారం ఉన్నదానిలా ఉన్నావు" అంది.

"ఏమిటమ్మా మీ రనేది? ఇంకా నాకు పెళ్లే కాలేదు!" అని పైట సవరించి బోసిమెడ చూపిం చింది మంగళసూత్రం లేదని ఋజువుగా.

చూడడానికి మధ్యవయస్కురాలు. సుందరానికి భార్య అంటే నమ్మదగిన ఈడు ఉంది.

అందరి ఆశ్చర్యం ఎక్కువైంది. సుందరాన్ని మింగేసే టట్లు చూచారు. సుందరం ఆమెనే చూస్తూ నిలుచున్నాడు. దుఃఖం పట్టలేక వెక్కివెక్కి ఏడవటం ప్రారంభించింది. అన్ని బయటి జగడాలలోలాగా ఈ బస్సులో కూడా ఒక విలన్ అవతరించాడు.

"ఏమిటయ్యా నీ ఒడాయి? ఇందాకటినుండి నేనూ చూస్తున్నా. ఎవరూలేని ఆడదాన్ని ఇలా లల్లరిచేస్తావా? నోరు కదిపావంటే డొక్కలిరిచేస్తా!" అని దుమికాడు. ఒకరిద్దరు ఆ రుద్రస్వామిని లగ్గించారు.

"చూస్తే, అలా పోకిరీ మనిషిగా లేడు." విలన్ పక్క ఉన్నాయన అన్నాడు.

"ఈలాంటివాళ్లే ఈ రోజుల్లో జేబులు కొడతారు." విలన్ హుంకరించాడు.

ఇంతలో బస్ 'అలంకార్' స్టాపులో ఆగింది. ఇద్దరిని దించి మళ్లీ కదిలింది.


"వెధవలు! ఇలాంటివాళ్ల డొక్కలు చీల్చాలి." విలన్, సుందరాన్ని చూస్తూ అన్నాడు.

"నోరు కాస్త తగ్గించి మాట్లాడాలి." సుందరం

మానవ జీవితం అనే ఈ రంగ స్థలంలో ప్రేక్షకులుగా ఉండే అవకాశం కేవలం భగవంతునికి, దేవతలకు మాత్రమే ఉంది.

—పైడగరావు






# ఛలోక్తి

జరుణలతో విలన్ సీటు వదిలి లేచాడు. మధ్యవర్తులు అటువైపు సుందరాన్ని, ఇటువైపు విలన్‌ను విడదీసి సమాధాన పరుస్తున్నారు. బస్సు స్పీడుగా వచ్చి ఆగిపోయింది. డ్రైవర్ వెనుదిరిగి చూస్తున్నాడు.

"ఈమె నిజంగా నీ భార్యేనా?" ఒక పెద్దమనిషి సుందరాన్ని నిక్కచ్చిగా అడిగాడు.

"అవునండీ."

"కాదు, కాదు" అని ఆమె అరిచింది.

"అయితే నిరూపించు. లేకుంటే దిగిరా పోలీస స్టేషన్‌కి."

"నై, నై. బస్సు స్టాపులో ఈయున్కి వెనకాల ఈమె వచ్చింది. ఈయున్కి, ఈమెకి మాట, చూపు లేదు. నాకి నాభార్యకి మాశా ఇద్కి అంతా. ఇద్కి అంతా అబద్ధం భాయీ, అబద్ధం." హుషారుగా అన్నాడు ఇందాకటినుంచీ కిక్కురుమనకుండా ఉండిన సాయబు.

"ఏం? మాట్లాడవేం?" అన్నాడో మధ్యవర్తి. అందరూ గుర్రుమని చూస్తున్నారు. స్త్రీ అయితే మరీ అసహ్యంగా చూస్తున్నారు. విలన్ తన వీరత్వం చూపడానికి ఛాన్స్ పోయిందని సానుభూతిగా ఆమెను చూశాడు.

"ఆమె హాండ్ బాగ్‌లో నా పర్సు ఉంది. అందులో నా ఫోటో ఉంది." అంటూ ఆశ్చర్యంగా ఆమెవైపు చూశాడు.

"ఏమమ్మా? అతని ఫోటో, పర్సు నీ బాగ్‌లో ఉన్నాయా?" పెద్దావిడ అంది.

"లేవు."

"అయితే చూపించమనండి." సుందరం ముందుకు వచ్చాడు.

"నేను చూపించను!" అంది.

అందరూ ఆశ్చర్యం అవుతున్నందుకు తలోవిధంగా ఉంటున్నారు. రహస్యం తేలిపోయిందనేమో నిపుగ్గా [illegible]డం ఆరంభించారు.

"నీవు చూపిస్తే సరే. లేకపోతే నీవుకూడా స్టేషన్‌కి రావలసిందే, అమ్మా" అన్నాడు మధ్యవర్తి.

పొంగి వస్తున్న దుఃఖాన్ని అణుచుకుని బాగ్‌లోని పర్సు తీసి సుందరం చేతిలో పెట్టింది. క్షణంలో బస్సుదిగి వెళ్ళిపోయింది. సుందరం పర్సుతీసి చూశాడు. జీతం మొత్తం [illegible] ఉంచినట్లే ఉంది. చూసుకుని జేబులో వేసుకున్నాడు. ఆమెకోసం తిరిగి చూశాడు. బస్సువచ్చినవైపే వేగంగా నడిచిపోతూంది. బస్సు చుట్టూ గుమిగూడినవాళ్లకు ఏమీ అర్థం కాలేదు. కండక్టరు ఈలవేశాడు. బస్సు కదిలింది. అంతా ఒక నిమిషంలో జరిగింది.

"ఇంతకీ ఆమె నీ భార్యేనా?" సందేహంగా మధ్యవర్తి కదిపాడు.

"కాదండీ. ఈ బస్సులోనే మొదటిసారిగా ఆమెను నా జీవితంలో చూశాను."

"అరే!" అని గుడ్లు పెద్దవిచేస్తూ లేవబోయాడు విలన్, ఆమె వెళ్ళినవైపు చూస్తూ. గియర్ మార్చిన కుదుపుతో మళ్ళీ సీట్లో కూలబడ్డాడు. ★